క్లుప్తంగా

నేడు జగనే కావాలి.. జగనే రావాలి సదస్సు

కోవెలకుంట్ల: స్థానిక శివకాశి పంక్షన్ హాలులో గురువారం నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే కావాలి.. జగనే రావాలి.. జగన్ మా భవిష్యత్ సదస్సును జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ బీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, తదితర ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, గృహ సారథులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు సొదరదిన్నెలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. వైద్య శిబిరంలో నలుగురు డాక్టర్లు రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని అమడాల, గుంజలపాడు, సొదరదిన్నె గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు గిద్దలూరులో...

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య వైద్య శిబిరం గురువారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. గిద్దలూరు, మంగపల్లె, రామభద్రుని పల్లె గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తోళ్లమడుగులో....

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తోళ్లమడుగు గ్రామ సచివాలయం పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సచివాలయం పరిధిలోని ఉమ్మాయిపల్లె, ఉమ్మాయి పల్లె తండా, కోర్నపల్లె, అబ్దులాపురం, తోళ్లమడుగు గ్రామాల ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం దుకాణాల తనిఖీ



పాతపాడు మద్యం దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బనగానపల్లెరూరల్: బనగానపల్లెలోని ప్రభుత్వ మద్యం దుకాణాల రికార్డులను శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఎక్సైజ్ ఎస్ఐ ఉమామనోహర్ రాజు బృందం బుధవారం తనిఖీ చేశారు. పాతపాడు, పట్టణంలోని మూడు ప్రభుత్వ మద్యం దుకాణాలలో మద్యం నిలువలపై ఎక్సైజ్ ఎస్ఐ ఆరా తీశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. క్రాస్ చెకింగ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టాలమని ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నాగభూషణం, గౌతం, దేవేంద్ర, భారత్ తదితరులు పాల్గొన్నారు.

శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభం

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీపై అందించే శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైందని ఏఓ జ్యోతి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. మండలానికి 1800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని, 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆధా ర్, పట్టాదార్ పాసు బుక్ జిరాక్స్‌లు తీసుకెళ్లి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

మానవుని మనుగడకు అడవుల దోహదం

బేతంచెర్ల: భూమిపైన నివసించే మానవాళి మనుగడకు అడవులు దోహదం పడుతాయని రంగాపురం, అవుకు బీట్ అటవీ శాఖ అధికారులు జయ్యమ్మ, సురేంద్ర నాయుడు తెలిపారు. బుధవారం పట్టణానికి సమీపంలోని కస్తూర్బా విద్యాలయంలో వన్యప్రాణుల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అడవుల వలన కలిగే ప్రయోజనాలను వారు విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు అడవులతోపాటు వన్యప్రాణుల సంరక్షించుకోవాలని సూచించారు.

శౌర్య జాగరణ యాత్రను జయప్రదం చేయండి

డోన్ టౌన్ : శౌర్య జాగరణ యాత్ర గురువారం డోన్ పట్టణంలోకి ప్రవేశనుందని, హిందువులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ నాయకుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిర నిర్మాణం 2024 జనవరి 21 నుంచి 24న ప్రారంభోత్సవం, విశ్వ హిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాల సందర్భంగా దేశ వ్యాప్తంగా షష్ఠాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబర్ 30వ తేదీన శౌర్య జాగరణ యాత్ర ప్రారంభమైందన్నారు. 5వ తేదీ సాయిత్రం 4గంటలకు స్థానిక కంభాలపాడు సర్కిల్ మీదుగా పట్టణంలోకి యాత్ర ప్రవేశిస్తుందని, పాతపేటలోని రాముల దేవాలయంలో సభను ఉంటుందని ఆయన వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజారోగ్యానికి రక్ష

- కిటకిటలాడుతున్న హెల్త్ క్యాంప్‌లు
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేస్తున్న డాక్టర్లు
- స్వగ్రామంలో కార్పొరేట్ వైద్యం అందుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్య శిబిరం వద్ద మందులు తీసుకుంటున్న ప్రజలు

బనగానపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తుంది. కార్యక్రమంలో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. వైద్య నిపుణులు చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి బీపీ, షుగర్, గుండె పరీక్షలు ఎక్కువగా జరుగుతున్నట్లు వైద్యులు చెప్పారు. ఈ మేరకు బనగానపల్లె మండల పరిధిలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌నకు ప్రజలు తరలివచ్చారు. దీంతో వైద్య శిబిరం కిటకిటలాడింది. ఉదయం 9.,30 గంటల నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం సాగింది. మెడికల్ ఆఫీసర్ల శ్రీలక్ష్మి, సోహెల్‌బాబు, డాక్టర్ శైలజ, డాక్టర్ ఫిరోజ్, డాక్టర్ లలిత, కంటి వైద్యుడు వెంకటేశ్వర్లు వివిధ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, వివిధ రక్త పరీక్షలు, పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధుల రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కీళ్ల, మోకాళ్ల నొప్పులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేస్తుండడంతో రోగులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ గురు ప్రసాద్, ఈఓ ఖలీల్, వీఆర్‌ఓ సురేష్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు, ఎంపీహెచ్ఏ సరళగంగా, వైఎస్సార్‌సీపీ నాయకులు పీఎల్ తులసీరెడ్డి, శేషిరెడ్డి, నాగరాజు, వెంకటసుబ్బయ్య, భక్తవత్సలరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చెర్లోపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

495 మందికి వైద్య పరీక్షలు

అవుకు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో బుధవారం ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌నకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. డాక్టర్లు యమునా, జయేంద్రరెడ్డి, గైనకాలజిస్ట్ శ్రీలక్ష్మి, జనరల్ సర్జన్ రాజేష్‌లు 495 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె, కంటి తదితర రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 90 మందికి కంటి పరీక్షలను నిర్వహించి ఎనిమిది మందికి అద్దాలను అందజేశారు. అదేవిధంగా సర్జరీలు అవసరమైన 33 మందిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిన్న కంబగిరిస్వామి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడిపాడులో ..

ప్యాపిలి: మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో బుధవారం ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, వైద్యాధికారులు వాణిశ్రీ, ఇంతియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పావతి, జార్జ్ తదితరులు రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐదుగురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్ర గౌడ్, గంగాదేవి, పంచాయతీ కార్యదర్శి ముంతాజ్ బేగం తదితరుల పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు సంతృప్తికరంగా ఉన్నాయి



వైద్య పరీక్షలు సంతృప్తికరంగా ఉన్నాయి. నాకు కళ్ల మబ్బులతో పాటు మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్‌తో ఇబ్బంది పడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో డాక్టర్లు అన్నింటికీ ఓపిగ్గా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు కూడా ఇచ్చారు. చాలా తృప్తిగా ఉంది.గతంలో ఈ విధమైన వైద్య శిబిరాలు ఏన్నాడు ఏర్పాటు చేయలేదు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు తరుచూ నిర్వహిస్తే మాలాంటోళ్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– వెంకటసుబ్బారెడ్డి, పేషెంట్, నందవరం గ్రామం బనగానపల్లె మండలం

నయాపైసా ఖర్చు లేకుండా వైద్యం



నయాపైసా ఖర్చు లేకుండా ఇంటివద్దకే వైద్యులు వచ్చి ఉచితంగా వైద్య సేవలు అందిస్తుండం మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరం. యాంత్రిక జీవితంలో సొంత కుటుంబ సభ్యులే వృద్ధులను పట్టించుకోవడం లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు అప్పుడప్పుడు నిర్వహిస్తే బాగుంటుంది. జగన్ బాబు సాయం మరువం.

– బాలమ్మ, గోసానిపల్లె, డోన్ మండలం

స్వగ్రామంలోనే వైద్య సేవలు అభినందనీయం



స్వగ్రామంలోనే వైద్య సేవలు అందించడం అభినందనీయం. గత ప్రభుత్వంలో వైద్యం గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగ పడుతోంది. నాకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– సుంకమ్మ, సిమెంట్ నగర్, బేతంచెర్ల మండలం

ఉచితంగా కంటి అద్దాలు



నాకు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచితంగా అవసరమైన కంటి అద్దాలు ఇచ్చారు. మా ఇంటి వద్దకే వైద్య సిబ్బంది, వలంటీర్లు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగింది. 2012లో గుండె ఆపరేషన్ జరిగింది. మూడువేల రూపాయల విలువైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున్న పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసిన సీఎం జగన్‌కు రుణ పడి ఉంటాం.

– వెంకటేశ్వర్లు, సిమెంట్ నగర్, బేతంచెర్ల మండలం

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామ రక్ష



డోన్: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి



ప్యాపిలిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డోన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోసానిపల్లె గ్రామంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. వైద్య నిపుణులు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరం మేరకు రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఆరోగ్య సమస్యలతో ఏ ఒక్కరూ ఇబ్బంది పడుకూడదన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. పల్లెల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, గోసానిపల్లె సర్పంచ్ బాలమ్మ, మాధవస్వామి, అర్జున్, రాజు, మద్దయ్య, చంద్రకుమార్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, ఎంపీటీసీ సభ్యులు మదనగోపాల్, వైద్యులు రాంభూపాల్, శ్రీకాంత్, నిఖిల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సతీష్, మెడికల్ అధికారి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల సిమెంట్ నగర్‌లో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ప్రజా ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత

బేతంచెర్ల: ప్రజా ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని, ఆదిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్ 1వ సచివాలయం పరిధిలో సర్పంచ్ ఏస్తేరమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ ప్రారంభించారు. వైద్యులు హెహతాబ్, భార్గవి, వెంకటేశ్వర్లు, వంశీ కృష్ణ, రమణమూర్తి , ఆరోగ్య సిబ్బంది రోగులకు బీపీ, షుగర్, రక్త, గల్ల పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దనే రోగులకు వైద్యం అందించిన ఘనత సీఎంకు దక్కిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్ వైజర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, యాకోబ్, యోబ్, నాగ శంకర్, వన్నూర్ సాహెబ్, ఐజయ్య, కాశీం ఫిరా, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జంతు సంపదను పరిరక్షించుకోవాలి

బనగానపల్లెరూరల్ : జంతు సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్ మహమ్మద్‌గౌస్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతదేవి ఆధ్వర్యంలో ప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో మానవ స్వార్థం కారణంగా ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, జంతువుల సంరక్షణపై ప్రజలకు కల్పించడం ప్రపంచ జంతు దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. రసాయనశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ నాగరాజారెడ్డి మాట్లాడుతూ మన భూగోళాన్ని పంచుకునే అనేక జాతులను రక్షించడం, సంరక్షించడం మన కర్తవ్యం అని చెప్పారు. కార్యక్రమంలో గణిత అధ్యాపకుడు డాక్టర్ బాబు నాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్

ప్యాపిలి మార్కెట్‌లో టమాటా కిలో రూపాయి

ప్యాపిలి: స్థానిక మార్కెట్‌లో బుధవారం టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. కిలో రూపాయి ప్రకారం 25 కిలోల బాక్స్ ధర రూ. 25 పలకడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కాస్త చిన్న సైజు పండ్లు ఉన్న బాక్స్‌లను అడిగే నాథుడు లేకపోయాడు. దీంతో రైతులు తమ బాక్సులలోని పండ్లను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. సుదూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు టమాటా బాక్సులను తీసుకువచ్చామని పలువురు రైతులు వాపోయారు. కనీసం కూలీల ఖర్చు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోయారు.

మృతి చెందిన ఆపరేటర్ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్ : మండల పరిధిలోని మల్యాల సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన గోవిందు భార్యకు తోటి ఉద్యోగులు తమ వంతు సాయంగా రూ.36,850 అందజేశారు. కొన్నిరోజుల క్రితం గోవిందు పత్తికొండకు వెళ్లి బస్సు ఎక్కేక్రమంలో ప్రమాద వశాత్తూ కింద పడిటంతో గాయపడి మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం మృతుని ఇంటి వద్దకు ఉద్యోగులు వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్ రవి, నాగార్జున, నాగరాజు, కాంట్రాక్టు కార్మికులు పాండురంగ, గౌస్, గోపీ, సాయి, పురుషోత్తం, అంకన్న తదితరులు పాల్గొన్నారు.



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఓటరు సర్వేను జాగ్రత్తగా చేయాలి

డోన్ రూరల్ : ఓటర్ల సర్వేను జాగ్రత్తగా చేయాలని, ఎటువంటి తప్పులు జరగకూడదని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. స్థానిక మండల కార్యాలయంలో బుధవారం ఎలక్షన్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. మృతి చెందిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయినా, డబుల్ ఎంట్రీ పేర్లను పూర్తిగా విచారించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

అవుకు: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ శ్రీధర్ రావు సూచించారు. మండల పరిధిలోని రామాపురం ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం ఎంఈఓ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వెంకటేశ్వరరెడ్డి, సీఆర్‌పీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రామాపురంలో మధ్యాహ్న భోజన అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్ రావు

ఆటో డ్రైవర్లపై కేసు నమోదు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందవర్గం పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఎస్ఐ రామాంజనేయరెడ్డి వాహనాల తనిఖీ చేశారు. కొత్తూరు సుబ్బరాయుడు, చెరువుపల్లె, బీరవోలు, రామక్రిష్టాపురం గ్రామాలకు చెందిన ఆటోల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తున్న నలుగురు ఆటో డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిబంధనల మేరకు ప్రయాణికులను లేదా కూలీలను తరలించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్యాపిలి: మండల పరిధిలోని పోదొడ్డి గ్రామ శివారులో పేకాట స్థావరంపై ప్యాపిలి పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోగా మరి కొందరు పారిపోయి నట్లు సమాచారం. నిందితుల నుంచి పోలీసులు ఒక మోటార్ బైక్, రూ. 1,00,600 స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పేకాట నిర్వహణపై పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దాడి కేసులో ఐదుగురికి రిమాండ్

డోన్ టౌన్ : సెప్టెంబర్ 27వ తేదిన పట్టణంలోని కొండపేటకు చెందిన షేక్ మౌలాలీపై దాడి చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జడ్జి ముందర హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు పట్టణ పోలీసులు బుధవారం తెలిపారు. పాత కక్షల కారణంగా మౌలాలీ, అతని కుటుంబ సభ్యులపై బలిజ వినోద్, రామాంజనేయులు, ఆలా అరవింద్, ఆలా ప్రవీణ్, అనీల్‌కుమార్, షేక్ హుస్సేన్‌బాషా తదితరులు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన మౌలాలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పట్టణ పోలీసులు వినోద్ మినహా మిగిలిన ఐదు గురిని అరెస్టు చేసి జడ్జి ముందర హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు.

మినీ బస్సుపై కేసు నమోదు

డోన్ రూరల్ : తెలంగాణా రాష్ట్రానికి చెందిన మినీ టూరిస్ట్ బస్సుపై కేసు నమోదు చేసి, రూ.60680 జరిమానా విధించినట్లు ఆర్‌టీఓ క్రాంతికుమార్ తెలిపారు. పట్టణం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం ఆయన సాధారణ వాహనాల తనిఖీ నిర్వ హించారు.గుత్తి వద్ద ఉన్న బాట సుంకులమ్మకు వెళ్లి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న మినీ బస్సును ఆర్ టీఓ తనిఖీ చేశారు.ఆంధ్రప్రదేశ్‌కు రోడ్ ట్యాక్స్ కట్టకుండా వాహనం నడుపుతుండడంతో కేసు నమోదు చేసి, జరిమానా విధించామని క్రాంతికుమార్ తెలిపారు.



జరిమానా విధిస్తున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

ఏటీఎం మోడల్ సాగు లాభదాయకం

బనగానపల్లెరూరల్ : ఏటీఎం మోడల్ పద్ధతిలో పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డికి చెందిన 40 సెంట్ల వ్యవసాయభూమిలో 20 రకాల కూరగాయలు, ఆకు కూరలు ఏటీఎం మోడల్ పద్ధతిలో సాగు చేయు కార్యక్రమాన్ని నరేంద్రారెడ్డి ప్రారంభించారు. పూజ చేసి సాగు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎం మోడల్స్ బెడ్స్ పద్ధతిలో తక్కువ విస్తీర్ణంలో కూరగాయాలు, ఆకుకూరలు ఎక్కువ పంటలు సాగు చేయొచ్చన్నారు. ఖర్చు కూడ తక్కువగా ఉంటుందని, వివిధ రకాల పంటలను సాగుతో నిత్యం ఆదాయం వస్తుందన్నారు. అలాగే రైతులు రసాయనిక మందులు కాకుండా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందన్నారు. మండలంలో 15 మంది రైతులు ఏటీఎం మోడల్ పద్ధతిలో పలు రకాల పంటలను సాగు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ ఎంటీ రవీంద్రాచారి, మండల ఇన్‌చార్జ్ మున్నీ, ఐసీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు పేరుసోముల విద్యార్థి

సంజామల: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీ బాల్ పోటీలకు సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్ శ్యామ్ ఎంపిక అయ్యారు. ఈ నెల 2న కర్నూలు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సీతారావమ్మ తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో నంద్యాల జిల్లా జట్టులో శ్యామ్ ఆడుతాడన్నారు.ఈ మేరకు గురువారం విద్యార్థి శ్యామ్‌తోపాటు వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.



శ్యామ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి బుధవారం ప్యాపిలి మండలంలో విస్తృతంగా పర్యటించారు. హుసేనాపురం, బావిపల్లి, చంద్రపల్లి, వెంగళాంపల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తితో కలసి బుగ్గన అర్జున్ రెడ్డి ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. హుసేనాపురం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, గొర్రెల పెంపకందారుల భవనాలను పరిశీలించారు. నిర్మాణాలు శరవేగంగా జరుగుతుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం హుసేనాపురం, చంద్రపల్లి గ్రామాల్లోని అరటి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అరటిలో వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో ప్రస్తుతం ధర తదితర విషయాలపై ఆరా తీశారు. హుసేనాపురంలోని సచివాలయాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెంగళాంపల్లి గ్రామ సమీపంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. శాశ్వత అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని ఈ సందర్భంగా బుగ్గన అర్జున్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హుసేనాపురం, వెంగళాంపల్లి సర్పంచులు మహేశ్వర్ రెడ్డి, రంగస్వా మి,న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నా యకులు నేరేడుచెర్ల చంద్రశేఖర్ రెడ్డి, అలేబాదు ప్రవీ ణ్, మస్తాన్ ఖాన్, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రేమసాగర్ రెడ్డి, పూజారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



హుసేనాపురం ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి

మట్కాబీటర్ల అరెస్ట్

కోవెలకుంట్ల: రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఇద్దరు మట్కాబీటర్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు.రేవనూరు గ్రామానికి చెందిన సురేష్ గౌడ్, నాగేశ్వరరెడ్డి గ్రామ శివారులో మట్కా బీట్ నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. బీటర్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి మట్కా చీటీలు, రూ. 50,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.